# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో ధ్యానం ఆశాకిరణంగా ఉద్భవించిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ❖ భారతదేశం ప్రపంచ శక్తి కేంద్రంగా ఎదుగుతోందని, శక్తిమంతమైన నాయకులు అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ జీ-20ని సంరక్షించడానికి భారతదేశం, చైనా చాలా కృషి చేశాయని కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ గత పదేళ్లలో వ్యక్తిగత ఆరోగ్య వ్యయం 64 శాతం నుంచి 39 శాతానికి తగ్గిందని కేంద్ర ఆరోగ్య మంత్రి జే.పీ. నడ్డా వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 119వ ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

========================

మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో ధ్యానం ఆశాకిరణంగా ఉద్భవించిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆఫ్ మెడిటేషన్ లీడర్స్ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... ఆందోళన, నిరాశ రూపంలో మానసిక రుగ్మతలు వైద్యానికి ఒక క్లిష్టమైన సవాలుగా ఉద్భవించాయని అన్నారు. భారతదేశం 5 వేల సంవత్సరాల విశిష్ట నాగరికతతో ప్రపంచ సాంస్కృతిక కేంద్రంగా మారిందని పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

జీ-20ని సంరక్షించడానికి, రక్షించడానికి భారతదేశం, చైనా చాలా కృషి చేశాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా ఈరోజు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో జయశంకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశం, చైనాలు జీ20, SCO, BRICS లలో సభ్యులుగా ఉన్నాయని పేర్కొన్నారు. పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతీయ, ప్రపంచ సమస్యలు కూడా ఉన్నాయని, ఈ సమావేశంలో ఆలోచనల మార్పిడి రెండు దేశాల పరస్పర ప్రయోజనానికి ఉపయోగపడుతుందని జైశంకర్ అన్నారు.

========================

భారతదేశం ప్రపంచ శక్తి కేంద్రంగా ఎదుగుతోందని, అందుకు ప్రతి రంగంలో శక్తిమంతమైన నాయకులు అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో మొదటి విడత స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ – (soul) కాన్‌క్లేవ్ ను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచ స్థాయిలో పోటీ పడాలంటే ప్రపంచ స్థాయి నాయకులు, అంతర్జాతీయ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. జాతీయంగా, ప్రపంచ స్థాయిలో రాణించే నాయకులను సోల్ తయారు చేస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ ప్రయాణంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ స్థాపన ఒక ముఖ్యమైన ముందడుగు అని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఈ సందర్భంగా భూటాన్ ప్రధానమంత్రి దాషో షెరింగ్ టోబ్‌గే మాట్లాడుతూ... soul ప్రధానమంత్రి నరేంద్రమోదీ మానస పుత్రిక అని, నిజమైన నాయకులను తీర్చిదిద్దడంలో ప్రధానమంత్రికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇది మరో నిదర్శనమని అన్నారు. రెండు రోజుల పాటు సాగుతున్న ఈ కాన్ క్లేవ్ రాజకీయాలు, క్రీడలు, కళలు, మీడియా, ఆధ్యాత్మిక ప్రపంచం, పబ్లిక్ పాలసీ, వ్యాపారం, సామాజిక రంగం వంటి విభిన్న రంగాలకు చెందిన నాయకుల స్ఫూర్తిదాయకమైన జీవిత ప్రయాణాలను పంచుకునే ప్రధాన వేదికగా ఉపయోగపడుతుంది.

========================

పెట్టుబడి అవకాశాలతో పాటు, భారతదేశం అందించే అధిక నాణ్యత ప్రతిభ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పెట్టుబడిదారులను కోరారు. ఈరోజు కేరళలోని కొచ్చిలో జరిగిన “ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్”ను ఉద్దేశించి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... రాబోయే కొన్నేళ్లలో 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు ఎదగడానికి సిద్ధంగా ఉన్న భారత్, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు సాటిలేని అవకాశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశం మొత్తం సహకార స్ఫూర్తితో పని చేస్తోందని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ... కేరళను ఆకర్షణీయమైన పెట్టుబడి కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టదని తెలిపారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

========================

గత పదేళ్లలో వ్యక్తిగత ఆరోగ్య వ్యయం 64 శాతం నుంచి దాదాపు 39 శాతానికి తగ్గిందని కేంద్ర ఆరోగ్య మంత్రి జే.పీ. నడ్డా తెలిపారు. ఈ రోజు న్యూ ఢిల్లీలో జరిగిన 12వ విడత అంతర్జాతీయ ఆరోగ్య చర్చ -2025ను ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాల క్రింద అందించబడిన సేవలతో వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్య ఖర్చులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. యూనివర్సల్ హెల్త్ కవరేజీని సాధించేందుకు 2018లో ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. దేశ జనాభాలో దాదాపు 40 శాతం మంది ఈ పథకం కింద వున్నారని నడ్డా చెప్పారు. సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులందరినీ ఈ పథకంలో చేర్చడం జరిగిందని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళా విశ్వాసం, సంస్కృతి, ఆధ్యాత్మికతల సంగమం అని దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కంచన్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈరోజు మహాకుంభ్ సెక్టార్ 4లోని కుంభవాణి స్టేషన్‌లో ఆమె ప్రసంగిస్తూ... ఈ దివ్య సంఘటన సందేశాన్ని ప్రతి ఒక్కరి హృదయాలకు వ్యాప్తి చేయడానికి కుంభవాణి ఒక అపురూపమైన మాధ్యమంగా నిలిచిందని అన్నారు. ఈ స్టేషన్ తన శ్రోతలకు జ్ఞానాన్ని, భక్తిని, దృఢనిశ్చయాన్ని అందించడం కొనసాగించాలని ఆమె ఆకాంక్షించారు. గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల్లో ఆధ్యాత్మిక శాంతి, నూతన శక్తిని నింపుతుందని కంచన్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

========================

సంస్కృతిని భుజానికెత్తుకునేది భాష అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనాన్ని ప్రధానమంత్రి ప్రారంభించి ప్రసాగించారు. మహారాష్ట్రలోని అనేక మంది సాధువులు మరాఠీ భాషలో భక్తి ఉద్యమం ద్వారా సమాజానికి కొత్త దిశను చూపించారని తెలిపారు. మరాఠీ భాష, సాహిత్యం సమాజంలోని అణగారిన వర్గాలకు సామాజిక విముక్తిని అందించే విశేషమైన బాధ్యతను నిర్వర్తించాయని ప్రధానమంత్రి అన్నారు.

========================

మాల్దీవుల్లోని మాలేలో జరిగిన 13వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో బంగ్లాదేశ్‌కు చెందిన బే ఆఫ్ బెంగాల్ ప్రోగ్రామ్ - ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ (BOBP-IGO) అధ్యక్ష బాధ్యతలను భారతదేశం ఈరోజు స్వీకరించింది. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖి నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం అధ్యక్షత వహించింది. BOBP-IGO విజయాన్ని కొత్త శిఖరాలకు చేర్చేందుకు భారతదేశం కృషి చేస్తుందని డాక్టర్ లిఖి హామీ ఇచ్చారు. ప్రాంతీయ సహకారం ప్రాముఖ్యతను, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను అభివృద్ధి చేయడంలో ఇతర దేశాలతో పాటు భారతదేశం కూడా కీలక పాత్ర పోషిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

========================
========================